

హ్యాండ్‌బాల్ పోటీలకు కెఎల్ఎం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇసిఇ విభాగం నాలుగో సంవత్సరం చదువుతున్న కెఎల్ఎం విద్యార్థిని పి.విహిత ఇటీవల జెఎన్‌టియు అనంతపురం పరిధిలోని కళాశాలల హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనపరచి యూనివర్సిటీ టీంలో చోటు దక్కించుకుంది. మార్చి 2026లో కేరళలోని కొట్టాయం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారు. కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ రత్నమ్మ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

సా..గుతున్న రబీ

కడపలో 1,90,488, అన్నమయ్యలో 24,960 ఎకరాల్లో విత్తనం

నెలాఖరుకు నాటికి ముగియనున్న సీజన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాల్లో మరో 15 రోజుల్లో రబీ సీజన్ ముగియనుంది. 2025-26 రబీ సీజన్‌లోని అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో నెలకొన్న తుపాన్‌ల కారణంగా కడప జిల్లాలో 55.17 శాతం, అన్నమయ్య జిల్లాలో 36.11శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటల సాగుకు నోచుకుంది. కడపలో 44.83 శాతం విస్తీర్ణం, అన్నమయ్యలో 64.89 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు చేయాల్సిఉంది. ఈ ఏడాది రబీ సీజన్ ముగింపునకు గల 15 రోజుల వ్యవధిలో కడపలో 44.83 శాతం విస్తీర్ణం, అన్నమయ్యలో 64 శాతం విస్తీర్ణంలో పంటల సాగు కావడంపై ఉభయ జిల్లా వ్యవసాయశాఖల సాగు లక్ష్యాలు ఆధారపడి ఉన్నాయని చెప్పవచ్చు.



ఉభయ జిల్లాలో రబీ సీజన్ ఊగిసలాడుతోంది. 2025-26 రబీలో కడప జిల్లాలో 3,45,296 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,12,634 ఎకరాలు వెరసి 4,57,930 ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఉభయ జిల్లాల వ్యవసాయశాఖలు ప్రణాళికల్ని రూపొందించుకున్నాయి. రబీ సీజన్ ఆరంభ నెలయైన అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ ఒకటి వరకు పంటలు సాగు చేయాల్సి ఉంది. డిసెంబర్ 15 నాటికి కడప జిల్లాలో 1,90,488 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 24,960 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాలో 2,15,178 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన మరో 2,42,752 ఎకరాల్లో విత్త నం పడాల్సి ఉంది. గతేడాదితో పరిశీలిస్తే సగటున 1,90,488 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన గతేడాదితో పోలిస్తే 58,883 ఎకరాల్లో వెనుక బడడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ మాసం వరకు విత్తనం పడే అవకాశం ఉన్నప్పటికీ లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహం నెల కొంది.

జులై, అక్టోబర్‌లోనే లోటు

రబీ సీజన్‌లో జులై, అక్టోబర్ మాసాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జులైలో 96.7 మి.మీ నమోదు కావాల్సి ఉండగా -38 మి.మీ నమోదైంది. ఈలెక్కన సుమారు 59 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అన్నమయ్య జిల్లాలో అక్టోబర్‌లో 109.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా -36.3 మి.మీ తక్కువ వర్షపాతం నమోదు కావడం గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తోంది. అక్టోబర్ ఒకటి నుంచి నవంబర్, డిసెంబర్ రెండవ వారం వరకు తుపాన్ ప్రభావం కారణంగా ఆశాజనకంగా వర్షపాతం నమోదైన సంగతి తెలిసిందే. ఫలితంగా రబీ సీజన్ అంతమాత్రంగా సాగుతోంది.

బుడ్డశనగ సాగులో కోత!

జిల్లాలో రబీలో ప్రధాన ఆహారపు పంట బుడ్డశనగ, ఇటువంటి ప్రాధాన్య పంట సాగులో గణనీయంగా తగ్గుదల కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,03,184 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 1,67,051 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన మిగిలిన 36,133 ఎకరాల్లో విత్తనం పడని పరిస్థితి కనిపిస్తోంది. మిగిలిన సాగు విస్తీర్ణంలో కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు, జొన్న, రాగి సాగుకు మరలిపోతుందా లేదా బీళ్లుగానే దర్శనమిస్తుందా అనేది చూడాల్సిన పరిస్థితి దాపురించింది.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. నేటికి 55 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన 45 శాతంలో పంటల సాగు కావాల్సి ఉంది. కెసి కింద వరి సాగు ఊపందుకునే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమిస్తాం.

- చంద్రానాయక్, అగ్రికల్చర్ డిఎఒ కడప.

'ఉపాధి' చట్టానికి పేరు మార్చడం అన్యాయం : వ్య.కా.స

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి తలలేని మొండెం లాగా తయారు చేస్తోందని, పేరు మార్చడం అత్యంత దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్ వి.అన్వేష్ అన్నారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ సగటున 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించలేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించ లేకపోతున్నారని తెలిపారు. వలసలు నివారించాలంటే 200 రోజులు పనులు కల్పించాలని, నేటి ధరలకు అనుగుణంగా రూ.600 వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న అజివీక్ మిషన్ (గ్రామీణ) బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టడం మహాత్మ గాంధీ పేరును తొలగించటం చాలా దుర్మార్గమన్నారు. గాడ్సే వారసులమని అనిపించు కున్నారన్నారు. పథకంలో కేంద్రం వాటా 60శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం చేయడం చాలా అన్యాయం అన్నారు. మామూలు స్కిమ్ లాగా దీన్ని తయారు చేస్తున్నారన్నారు. ఈ కొత్త బిల్లులో 125 రోజులు పని పెంచుతున్నట్లు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. పాత పద్ధతిలోనే మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కొత్త బిల్లులకు వ్యతిరేకంగా కడపలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సురేష్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్

జిఆర్ఎంజి బిల్లును ఉపసంహరించుకోవాలి : సిపిఎం

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో తీసుకొస్తున్న జిఆర్ఎంజి బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరెడ్డి, పార్టీ నాయకులు నాగెళ్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్త బిల్లును ఏ ఉద్దేశంతో చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు కడుపు నింపే చట్టానికి పేరు మార్చి నిర్వీర్యం చేసే చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సిపిఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 17న ఉదయం 10 గంటలకు నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన 11 మంది అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్పు మాధవిని ఉద్దేశించి అనుచిత, అసభ్య వ్యాఖ్యలు చేసి వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన 11 మందిని అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భర్త శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ చిన్నపెద్దయ్య, ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ నిందితులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో ఎన్.శ్రీనివాసరెడ్డి, షేక్. నూర్‌బాషా, పాలెం ప్రతాపరెడ్డి, షేక్.నిజాముద్దీన్, ఎల్. రామకృష్ణారెడ్డి, మహమ్మద్ రియాజ్, ఇమ్రాన్ బాష, వెంకటరమణ, ఇస్మాయిల్ బాష, జబీబుల్లా, ముదస్సర్ ఉన్నారు.

పోలీసు అదుపులో బత్తల శ్రీనివాసులరెడ్డి

సోషల్ మీడియాలో నాయకుల ఫొటోలు మార్ఫింగ్, అశ్లీల పోస్టులు పెట్టిన నిందితుడు బత్తల శ్రీనివాసులరెడ్డిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికె మండలానికి చెందిన శ్రీనివాసులరెడ్డిపై బద్వేల్ టౌన్, కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమైందని పేర్కొన్నారు. నిందితుడు పరారీలో ఉండడంతో ఆచూకీ కోసం విచారించగా కువైట్‌లో తల దాచుకున్నట్లు తెలిసిందన్నారు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా, ఇతర రాజకీయ పార్టీల, నాయకుల, మహిళలపై అసభ్యకరమైన పోస్టింగులు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా పెడుతున్నట్లు గ్రహించామని తెలిపారు. కువైట్‌లో ఉన్న కారణంగా ఎస్‌పి అభ్యర్థన మేరకు ఇమిగ్రేషన్ అధికారులు లుక్ అవుట్ జారీ చేశారని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ఈ నెల 15న కువైట్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు నిందితుడు చేరుకున్నారని పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు లుక్ అవుట్ సర్క్యులర్ మేరకు ఎయిర్ పోర్టులో తనిఖీలు నిర్వహించి శ్రీనివాసులరెడ్డిని అదుపులోనికి తీసుకున్నారని తెలిపారు. చిన్న చౌక్ సిఐ ఓబులేసు పర్యవేక్షణలో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బందితో హైదరాబాద్ ఎయిర్పోర్ట్‌కు చేరుకుని నిందితుడిని అదుపులోనికి తీసుకుని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని చెప్పారు. విచారణలో అసభ్య పోస్టులు పెట్టినట్లు అంగీకరించాడని పేర్కొన్నారు. జ్యూడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే ఎంతటి వారినైనా, ఏ దేశంలో తలదాచుకున్న వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సోషల్ మీడియాను సమాజ హితానికి మాత్రమే వాడుకోవాలని సూచించారు. సమావేశంలో సిఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి - గోపవరం

ఉపాధి పనుల కల్పనలో పారదర్శకంగా ఉండాలని పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా మండలంలో అమలైన ఉపాధి హామీ పనులపై విస్తృ తంగా చర్చించారు. మండలంలో మొత్తం 579 ఉపాధి పనులు నిర్వహించగా, వీటికి గాను రూ.5,80,78,554 ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో కూలీలకు రూ.4,49,99,842 చెల్లించగా, పనిముట్లకు రూ.1,30,78,172 ఖర్చు చేసినట్లు వివరించారు. కూలీలకు సమయానికి కూలి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక తనిఖీల ద్వారా లోపాలను గుర్తించి సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలింగారెడ్డి, ఎంపిడిఒ సురేష్ బాబు, మైథిలి, ఎపిఒ విజయమ్మ, జడ్‌పిటిసి జయరాంరెడ్డి, రామసుబ్బారెడ్డి, భూమిరెడ్డిపల్లి రమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ ఆదిశేషారెడ్డి

టిడిపి జిల్లా అధ్యక్షుడిగా భూపేష్‌రెడ్డి

ఆనందోత్సాహంలో కార్యకర్తలు, అభిమానులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు



తెలుగుదేశం పార్టీ కడప జిల్లా పగ్గాలు జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్ సుబ్బ రామిరెడ్డికి ఎట్టకేలకు దక్కాయి. 2 నెలల నుంచి జిల్లా అధ్యక్షులు పీఠం పై ఉత్కంఠ కొనసాగుతూ ఉండగా ఎట్టకేలకూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కార్యాలయం నుంచి ప్రకటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా జమ్మలమడుగుకు లోకేష్ వచ్చిన సమయంలో జిల్లా మొత్తమేగాక రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు నియోజకవర్గ వైపు చూసేలా భూపేష్ రెడ్డి చేశారు. కనివిని ఎరుగని రీతిలో జనాలు పోగు చేశారు. దేవగుడి నారాయణరెడ్డి కుమారుడిగా, అటు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి రాజకీయ వారసుడిగా అన్ని విధాలా అర్హుడని అందరూ ముక్త కంఠంతో చర్చించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి లోకేష్ బాబు ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని భుజస్కందాలపై వేసుకొని చిన్న వయసులోనే అన్ని విధాలా ఎమ్మెల్యే టికెట్‌కు అర్హుడనే పేరును సంపాదించుకున్నారు. 2024 ఎన్నికలలో అనివార్య కారణాలవల్ల కూటమిలో భాగంగా బిజెపికి జమ్మలమడుగు టికెట్ కేటాయించడం వల్ల భూపేష్‌రెడ్డిల చిరకాల కోరిక తీరకుండా పోయింది. అయితే చిన్నాన్న ఆదినారాయణ రెడ్డి, తండ్రి నారాయణరెడ్డిలు చంద్రబాబుతో మాట్లాడి పార్లమెంటు సభ్యులుగా పోటీ చేశారు. కడప పార్లమెంటు పరిధిలో కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేలు వంటి ఏడు ఎమ్మెల్యే నియోజకవర్గాలలో భూపేష్ రెడ్డి ఒక పులివెందుల నియోజకవర్గంలో సైతం వైసిపి ఎంపీ అభ్యర్థి వై.ఎస్. అవినాష్ రెడ్డి ఓటింగ్ శాతాన్ని భారీగా తగ్గించారు. మిగతా నియోజక వర్గాలలో పైచేయిగా నిలిచి మరొక్కసారి జిల్లా మొత్తం తన వైపు తిప్పుకోవడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఎంపీగా ఓడిపోయినా జిల్లా ప్రజల మనసును భూపేష్ రెడ్డి దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించారు. టిడిపి అధికారంలోకి రాక ముందు పులివెందుల నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా రామగోపాల్‌రెడ్డి పోటీ చేస్తే ఆయన గెలుపును భూపేష్ భుజాన వేసుకొని గెలిపించడంలో చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల జరిగిన పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లోనూ భాగస్వామ్యమై పార్టీ అభ్యర్థికి గెలుపునకు కృషి చేశారు. మంగళవారం భూపేష్ రెడ్డి కి పగ్గాలు దక్కడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు 42 సంవత్సరాలకే జిల్లా భాధ్యతలు తీసుకున్న చిన్న వయస్కుడుగా కూడా జిల్లాలో నిల్వనున్నారు. ఇన్నాళ్ల కష్టానికి సరైన న్యాయం జరిగిందని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు భావిస్తున్నారు. తనపై మరింత బాధ్యతను పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు



సంబరాలు చేసుకుంటున్న టిడిపి కార్యకర్తలు, అభిమానులు



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప

నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని జిల్లా పాలనాధికారి ఛాంబర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) వారి ఆధ్వర్యంలో ఈ నెల 20న కడప గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించనున్న పట్టణ ఎస్‌హెచ్‌జి కుటుంబాలలోని నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ జెసి అదితి సింగ్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్-మేళాలో పేరొందిన కంపెనీలు పాల్గొని ఎస్‌హెచ్‌జి కుటుంబాలలోని నిరుద్యోగ యువతీ యువకులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. https://jobmela. mepmaap. comలో వివరాలను నింపి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్ల వయసు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, బిటెక్, ఎంటెక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్హతలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు మాత్రమే అర్హులన్నారు. **సమర్థవంతంగా అంగన్వాడీ సేవలు..** మహిళా శిశు సంక్షేమ శాఖలో సమర్థవంతంగా సేవలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 5జి మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయుక్తం అవుతాయని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీలకు సరఫరా చేసిన 'శాంసంగ్ 5 జి' మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. జిల్లాలో ప్రాజెక్ట్‌ల వారిగా అంగన్వాడీ వర్కర్లకు, బ్లాక్‌ప్రాజెక్ట్‌కో-ఆర్డినేటర్‌లకు, సూపర్‌వైజర్లకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ పి.రమాదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: వేరుశనగ సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వి. శిల్పకళ పేర్కొన్నారు. మంగళవారం కెవికె క్షేత్ర ప్రదర్శనలో భాగంగా మంగళవారం వల్లూరు మండలంలోని తోలుగంగనపల్లి గ్రామంలోని కేశవరెడ్డి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిసిజిఎస్ 1694 (విశిష్ట) అనే రకం ఆకు మచ్చ తెగులు, బెట్టను తట్టుకొనే, రకమని చెప్పారు. పంట వేసిన 110 రోజులలో చేతికి వస్తుందని, ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మంచి అనుకూలత కలిగిన ఈ రకాన్ని రైతులు ఉపయోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం నుండి తెగుళ్ల శాస్త్రవేత్త డాక్టర్ వి. మాధురి, మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, విఎయే దొరబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు..

ఆంధ్ర, ఉత్తరాఖండ్ మ్యాచ్ ప్రారంభం

- మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 202కు ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో మంగళ వారం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ మొదటి ఇన్ని ంగ్స్‌లో 69.5 ఓవర్లను 202 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆదిత్య నైతాని 57, లక్ష నైతాని 47 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని సిద్దు కార్తీక్ రెడ్డి 3, లోహిత్ 3, భార్గవ్ మహేష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 42 పరుగులు చేసింది.



తలపడుతున్న ఆంధ్ర, ఉత్తరాఖండ్ జట్లు

హామీల అమలు కోసం పోరుబాట : యుటిఎఫ్

ప్రజాశక్తి- ఒంటిమిట్ట : ఉపాధ్యాయుల సమస్యలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరుబాట పట్టనున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెన్నపేరూరులో జిల్లా కౌన్సిల్ సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే తమ ధ్యేయమని, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా పాలన సాగిస్తామని అనేక హామీలు ఇచ్చారన్నారు.విద్యారంగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించేందుకు ఈనెల 21న మైదుకూరులో జిల్లా కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. సమావేశాలలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శీలాకుమారి, ఉపాధ్యాయులు పెద్ద రెడ్డయ్య, శ్రీధర్, హెలెన్ మంజుల, అనురాధ, సుజన, శివరామకృష్ణమరాజు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి - కడప

డిజిటల్ యుగంలో కస్టమర్ అవగాహన పెరుగుతున్న అవసరాన్ని తెలియజేస్తూ, సురక్షితమైన, బాధ్యతా యుతమైన, పారదర్శకమైన బ్యాంకింగ్ అలవాట్లను అవలంభించాలని కెనరా బ్యాంక్ ప్రాంతీయ అధిపతి పి.అరుణజ్యోతి ప్రజలకు సూచించారు. మంగళవారం కడప కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో 7 రోడ్స్ వద్ద విస్తృత కస్టమర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ జ్యోతి మాట్లాడుతూ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం డిజిటల్ బ్యాంకింగ్‌ను సురక్షితంగా వినియో గించడం, మోసాల నివారణపై కస్టమర్లకు అవగాహన కల్పించడమే అని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఎస్. రమేష్, ప్రాంతీయ కార్యాల య బృందం ప్రజలతో నేరుగా మమేకమై, డిజిటల్ భద్రత, మోసాల నివార ణకు సంబంధించిన ముఖ్య సందేశాలను బలపరుస్తూ మార్గదర్శనం చేశారు.



మాట్లాడుతున్న అరుణజ్యోతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఉమ్మడి కడప జిల్లా ఖోఖో జూనియర్స్, సీనియర్స్ బాల బాలికల జట్లను మంగళ వారం ఎంపిక చేసినట్టు ఖో ఖో సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలోని నారాయణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. ఖోఖో సంఘం జిల్లా కార్యదర్శి జె. నరేంద్ర మాట్లాడుతూ జూనియర్స్ జిల్లా జట్టు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 21 తేదీలలో జె. పంగులూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. సీనియర్స్ జిల్లా జట్టు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ ఈనెల 24 నుంచి 26 వరకు కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో సంఘం సభ్యులు సుధీర్, లక్ష్మి, రవి, పవన్ కుమార్, వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, లక్ష్మణ్ , రెడ్డయ్య, పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-కాశినాయన : మండల కేంద్రమైన నర్సాపురంలోని ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని బద్వేల్ ఎఎస్ డబ్ల్యూఒ షేక్ హైఫా సోమవారం రాత్రి అకస్మింగా తనిఖీ చేశారు హాస్టల్ వార్డన్ హరికృష్ణ ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేసి రాత్రి సమయంలో విద్యార్థులు ఎలా ఉంటున్నారు, స్టడీ ఎలా ఉంటుంది అనే విషయాలపై ఆరా తీశారు. భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు భోజనాలు బాగా ఉన్నాయని తెలపడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సరైన సమయంలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టాలని వార్డెన్‌కు సూచించారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యుఒ



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఎపిడి మురళీమోహన్‌రెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికీ డ్రిప్ పరికరాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అర్హత కలిగిన ప్రతి రైతుకూ డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్లు ఎపిఎంఐపి ఎపిడి మురళీమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బలపనూరు గ్రామంలో మంగళవారం డ్రిప్ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం రాయితీతో, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. డ్రిప్పు ఇరిగేషన్ ద్వారా నీటి తడులు అందించడం వల్ల దిగుబడి పెరగడంతోపాటు కాయల నాణ్యత బాగా వస్తుందన్నారు. రైతులు డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐ ఎఒ ఏసునాథ్‌రెడ్డి, మండలంలోని డ్రిప్ డీలర్లు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న గంగులప్ప కుటుంబ సభ్యులు

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అంధుల ఆశ్రమంలో మంగళవారం రిటైర్డ్ సబ్‌జైలు వార్డెన్ ఆలూరు గంగులప్ప 17వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శ్రీపీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గంగులప్ప సతీమణి ఆలూరు తులసమ్మ, కుమారులు ఆలూరు నరసింహులు, ఆలూరు గంగాధర్ కుమార్, కోడలు ఉమాదేవి, జయంతి, మనవళ్ళు మనవరాళ్లు భోజనాన్ని వడ్డించారు. ఆలూరు నరసింహులు మాట్లాడుతూ తన తండ్రి గంగులప్ప జ్ఞాపకార్థం అంధులకు భోజనం వడ్డించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడాది తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

కళాశాలకు పేరు, ప్రతిష్టలు తేవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కళాశాలకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎ.నారాయణరెడ్డి విద్యార్థులను కోరారు. స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలోని వసతులతోపాటు అధ్యాపకుల అనుభవాలను విద్యా జ్ఞానాన్ని వినియోగించుకొని ఉజ్వల భవిష్యత్తును దిద్దుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో బాగా చదివి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ వై.నారాయణరెడ్డి, కళాశాల డైరెక్టర్ నీరజ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పోరుమామిళ్లలోని చిత్తశౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి చిత్తా దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉచితంగా దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి, జె.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి సారథ్యంలో సుబ్బారెడ్డి సోమిరెడ్డిపల్లె, బ్రహ్మనగర్, కంచిమల్లయపల్లె, చౌదరివారిపల్లె, నరసన్నపల్లె, గొడ్లవీడు, తోట్లపల్లె నుండి వచ్చిన 200 మంది వృద్ధులకు ఉచితంగా దుస్తులు, చలి దుప్పట్లు అందజేశారు.



వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేసిన దాతలు

ధాన్యం నిల్వకు సరిపడ గోదాములు ఏవీ..?

గిట్టుబాటు ధర వచ్చే వరకూ ధాన్యం నిల్వకులేని అవకాశం - పంట పొలాల్లోనే అమ్మకాలు



చాపాడులో అందుబాటులో ఉన్న గౌడోన్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు సరిపడే గోదాములు అందుబాటులో లేవు. పంట నూర్పిడి చేయగానే ఏ ధర ఉంటే.. ఆ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లో 60 వేల ఎకరాల్లో వరి పైరు సాగైంది. ఎకరాకు 30 బస్తాల వంతున దిగుబడి వచ్చినప్పటికీ 18 లక్షల బస్తాలకుపైగా దిగుబడి వస్తుంది. 14 ప్రైవేటు, 2 మార్కెట్ యార్డ్ వారి వరి ధాన్యం నిల్వ గోదాములు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మఠం మండల పరిధిలో వరి ధాన్యం నిల్వ గోదాములు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న వాటిలో 3.50 లక్షల బస్తాల నుంచి నాలుగు లక్షల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. మిగిలిన వరి ధాన్యాన్ని నిలువ చేసుకునే అవకాశాల్లేవు. పంట పొలాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ పరిధిలో గోడౌన్‌లను ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించి, స్థల సేకరణ చేపట్టింది. ఆ నిర్ణయం అమలుకు నోచుకోలేదు. పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ చేసుకునే వెసులు బాటు లేదు. జిల్లాలో వరి దిగుబడిలో 40 శాతంపైగా మైదుకూరు నియోజకవర్గంలోనే వస్తుంది. ఈ నేపథ్యంలో వరి రైతులను ఆదుకునేందుకు, గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ ఉంచుకునే విధంగా ధాన్యం గోదాములను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ప్రైవేట్ రంగంలో కూడా గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రస్తుతం 8బస్తాల ధర రూ.11,500. గత ఏడాది నుంచి వరి ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదే నిలువకు అవకాశం ఉంటే గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది. రైతుకు పంట పొలాల్లో పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఉండదు. గతంలో ప్రభుత్వం కొన్ని గ్రామాలను ఎంపిక చేసి గోడౌన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. రెవెన్యూ అధికారులు ఖాళీ ప్రదేశాలను గుర్తించి సమాచారాన్ని ఆర్డీవోలకు పంపారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి కనిపించలేదు. వచ్చే ఏడాదికైనా గ్రామాల్లో గౌడౌన్‌లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ధాన్యం నిల్వకు అవకాశం లేదు..

నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో పంట పొలాల్లో అమ్మకం చేపడుతున్నాం. రైతులు నిర్వహించుకునేందుకు అవసరమైన గోదాములు అందుబాటులో ఉంటే నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

- బాల నరసింహారెడ్డి రైతు, సిద్ధారెడ్డిపల్లె, చాపాడు

గోడౌన్లను ఏర్పాటు చేస్తే ఉపయోగం..

గ్రామాల్లో గోడౌన్లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం గోడౌన్లు సమీపంలో అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాల్సి వస్తుంది. చాలామంది రైతులు నిలువ ఉంచేందుకు అవకాశం లేక పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. ఆరు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. గోడౌన్‌లో నిల్వ ఉంచేందుకు ప్రయత్నాలు చేపడుతున్నాం.

- భాస్కర్, రైతు, విశ్వనాథాపురం, చాపాడు



అమ్మకానికి తరలిస్తున్న వరి ధాన్యం

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బి.లక్ష్మీరాజా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఈనెల 21న మైదుకూరు డిసిఎల్ కల్యాణమండపంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కోరారు. మైదుకూరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాంతీయ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం నుండి డిసిఎల్ కల్యాణమండపం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సమావేశ మందిరంలో ప్రతినిధుల సభ, భవిష్యత్ కార్యాచరణపై తీర్మానాలు, నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ వర్గం ర్యాలీ, సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవి కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మహేష్ బాబు, మైదుకూరు మండల ప్రధాన కార్యదర్శి బి శేఖర్, జిల్లా కౌన్సిలర్ వనమాల రాము, బి. మఠం మండల అధ్యక్షుడు గంగులయ్య, జక్సన్ నాయక్, సూర్య బాల గంగాధర్ పాల్గొన్నారు.

పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

పులివెందుల టౌన్ : పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యమని నూతనంగా ఎన్నికైన ఆ యూనియన్ మండల కన్వీనర్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత మెయిన్ పాఠశాలలో మంగళవారం జరిగిన పులివెందుల ప్రాంతీయ యుటిఎఫ్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు కన్వీనర్లను ఎంపిక చేశామన్నారు. పులివెందుల మండల కన్వీనర్‌గా చప్పిడి శ్రీనివాసరెడ్డి, తొండూరు మండల కన్వీనర్‌గా సూర రమేష్ బాబు, సింహాద్రిపురం మండల కన్వీనర్‌గా కాయపాటి రామాంజనేయులు, వేముల మండల కన్వీనర్‌గా కన్నె రాజశేఖర్, చక్రాయపేట మండల కన్వీనర్‌గా బోడసాని రవిశంకర్ తదితరులను ఎన్నుకున్నామన్నారు. ఎన్నికైన మండల కన్వీనర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు ఏవైనా పాలకులు ఎవరు ఉన్నా సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు వెళుతుందన్నారు. సంఘ నియమ నిబంధనలకు ఆకర్షితులమై పులివెందుల ప్రాంతంలో యుటిఎఫ్‌ను బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ముద్దనూరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి, ఫ్యాక్షన్ గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని సిఐ దస్తగిరి హెచ్చరించారు. చింతకుంట గ్రామంలో మంగళవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇల్లు, గడ్డి వాములు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫ్యాక్షన్ వీడి ఫ్యాషన్‌గా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఫ్యాక్షన్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంత వాతావరణానికి ప్రజలు, నాయకులు సహకరించాలని సిఐ కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సిఐ దస్తగిరి సూచించారు. ముద్దనూరులో మంగళవారం సిఐ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాలని బైకుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



వేంపల్లెలో హెల్మెట్ ధరించి ర్యాలీ చేస్తున్న పోలీసులు

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

బైక్‌లో ప్రయాణించేవారు హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం వేంపల్లెలోని ప్రధాన రహదారిపై పోలీసులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ లేనిదే వాహనం నడపరాదన్నారు. నడిపితే జరిమానా విధిస్తామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు హెల్మెట్ పెట్టుకొని ర్యాలీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : మండల కేంద్రంలోని దుగ్గన్నగారిపల్లె క్రాస్ వద్ద ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌లు, కార్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని పలు వాహనాలకు జరిమానా విధించారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్ పత్రం, ఇన్సూరెన్స్, టాక్స్ ప్రతాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.



వేముల : వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

యూనిఫైడ్ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ సర్వేకు పురపాలక ప్రజలు సహకరించాలని పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు కోరారు. పులివెందుల పురపాలక సవభవనంలో మంగళవారం ఆయన అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూనిఫైడ్ సర్వే ప్రారంభం కాబోతుందన్నారు. ప్రజల నుండి సమగ్ర కుటుంబ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ సంబంధ సమాచారం సేకరించే విధంగా ఈ సర్వేను ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. నెల రోజులపాటు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తి సమాచారాన్ని సేకరించి వారికి ఇకెవైసి ద్వారా సర్వే చేయాల్సి ఉంటుందని సూచించారు. ప్రభుత్వం నుంచి అందే పథకాలు, ఇతర ప్రయోజనాల కోసం ఇది ఉపయోగపడునని తెలియజేసారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 9 గంటలకు స్థానిక పివిఆర్ ఉన్నత పాఠశాల సమీపంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నామని ఆ ఫౌండేషన్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పురుషులకు 10 కి.మీ., మహిళలకు 10 కిమీ., 20ఏళ్లలోపు బాలురకు 8కి.మీ., బాలికలకు 6కి.మీ., 18 ఏళ్లలోపు బాలురకు 6కి.మీ., బాలికలకు 4కి.మీ., 16 ఏళ్లలోపు బాలురకు 2కి.మీ., బాలికలకు 2కి.మీ. పాల్గొనదలచిన వారు వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ తమ వెంట తెచ్చి నిర్వాహకులకు సమర్పించవలసి ఉంటుందన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు పందెం పోటీలు) 24 డిసెంబర్ 25న కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరుగునున్న పోటీలకు ఎంపిక అవుతారన్నారు. వివరాలకు 99496 86586, 80198 80995 సంప్రదించాలని వారు సూచించారు.

పారిశుధ్య పనులకు చర్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్లలో పారిశుధ్య పనులకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. మంగళవారం వేంపల్లి రోడ్డులో కాలువల్లో పూడిక తీత పనులను పరిశీలిస్తూ కమిషనర్ మాట్లాడారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పూడిక తీస్తున్నామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ కోరారు.



వేంపల్లె రోడ్డులో పూడికతీత పనులు చేయిస్తున్న కమిషనర్



ఉర్దూ కళాశాలలో మొక్కలు నాటుతున్న టిడిపి నేతలు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి సూచించారు. స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ రవి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మహ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, టిడిపి యువనేత ఎస్‌పి శివకృష్ణారెడ్డి, కళాశాల చైర్మన్ అబ్దుల్ గఫార్‌బాషా మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడంలో విద్యార్థులు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకొనేందుకు కళాశాల ప్రిన్సిపల్ రవి సొంత ఖర్చులతో మొక్కలు నాటించడం సంతోషకరమన్నారు. ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలన్నారు. మనిషి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు యాసిన్, టిడిపి నేతలు అబ్దుల్, ఇస్మాయిల్, హరినాథ్‌రెడ్డి, భాస్కర్, శివయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భాను ప్రకాష్‌రెడ్డిని కలిసి విన్నవిస్తున్న దేవస్థానం చైర్మన్ పివి రమణ

ఆలయ అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి వృషభాచలేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు కేటాయించి తోడ్పాటునివ్వాలని దేవస్థానం చైర్మన్ పాలేగాని వెంకటరమణ కోరారు. మంగళవారం తిరుమలలో ఉన్న టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, టిటిడి మెంబర్ భాను ప్రకాష్‌రెడ్డిని రమణ, ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్, గాలి హరిప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ వైఫల్యంతో దేవస్థానంలో పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. నిధుల కేటాయింపు విషయాన్ని టిటిడి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయలక్ష్మి, పాలక మండలి సభ్యులు ఎన్ సునీల్, ఏనుగొండ సుధాకర్ పాల్గొన్నారు.

మోడీకి మహాత్మాగాంధీపై అంత ద్వేషం ఎందుకు? : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉపాధి హామీ పథకం పేరు నుంచి మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడం చాలా అన్యాయం, దుర్మార్గమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఈ పథకం పేరు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా ఉండేదన్నారు. 2009 నుండి ఈ పేరుతోనే ఈ పథకం అమలు అవుతోందని తెలిపారు. ఉపాధి హామీ పథకం నూతన మార్గదర్శకాలు రాష్ట్ర ప్రభుత్వాలకు పెను భారంగా మారబోతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వము 90 శాతం ,రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు భరిస్తూ ఈ పథకం అమలు అయ్యేదన్నారు. నూతన మార్గదర్శకాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం నిధులు భరిస్తాయన్నారు. ఇది రాష్ట్రాలకు పెనుభారమని తులసిరెడ్డి వివరించారు. మోడీ ప్రభుత్వం పునరాలోచించి మహాత్మా గాంధీ పేరును అలాగే కొనసాగించాలని ఆయన కోరారు. గతంలో మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు భరించాలని తులసిరెడ్డి సూచించారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



వేముల రాము

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో సున్నం బట్టీల వీధిలో నివాసం ఉంటున్న మానసిక రోగి వేముల రాము కనిపించడం లేదని అతని తల్లిదండ్రులు లక్ష్మిదేవి, వెంకటేశు తెలిపారు. ఆ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ ఆరు రోజుల నుంచి రాము కనిపించడంలేదన్నారు. బంధువులు, తెలిసిన వారందరి ఇళ్ల వద్ద వెతికినా ఫలితంలేదన్నారు. రాము మూడున్నర అడుగుల ఎత్తు ఉన్నాడని, కాళ్లు వంకరగా ఉండటం వలన కుంటుతాడని ఆనవాళ్లు తెలిపారు. అతనికి 30ఏళ్లు అని తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 77021 06336, 83748 76337 నెంబర్లకు సమాచారమివ్వాలని వారు కోరారు.

పంటల సాగులో రైతులకు సూచనలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం తువ్వపల్లి, కట్టకిందపల్లె గ్రామాల్లో వ్యవసాయాధికారులు మంగళవారం రబీ పంటలకు సంబంధించి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ ఇ.బాల గంగాధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కజొన్న, సొద్ద, టమోటా సాగు, తీసుకోవలసిన జాగ్రత్తలు, పంటల బీమా, పంట నమోదుపై వివరించారు. వ్యవసాయ పరికరాల సబ్సిడీ కింద పంపిణీ చేయాలని రైతులు కోరారు. వీటి గురించి ప్రభుత్వానికి నివేదిక అందించామని, సమాచారం వచ్చిన వెంటనే మీ సంబంధిత రైతుసేవా కేంద్ర సిబ్బంది ద్వారా తెలియజేస్తామని తెలిపారు. సెరికల్చర్ అధికారి గురప్ప, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఆర్కేవ్యాలీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ మైండ్ స్పేట్-2కె25 హ్యాకథాన్‌లో ఇడుపులపాయి ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం డైరెక్టర్ అభినందించారు. విజయవాడలోని పిఎస్‌సి ఎంఆర్ కళాశాలలో బ్రైనోవర్శన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో జాతీయ స్థాయిలో మైండ్ స్పేట్-2కె25 హ్యాకథాన్ నిర్వహించారన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రముఖ విద్యాసంస్థల ఇంజినీరింగ్ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వెబ్ అండ్ యాప్ డెవలప్‌మెంట్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో వాస్తవ ప్రపంచ సమస్యలకు వినూత్న పరిష్కారాలు రూపొందించేలా నిర్వహించారన్నారు. విశ్వవిద్యాలయం నవీనత, పరిశోధన, పరిశ్రమ-ఆధారిత విద్యపై పెట్టే ప్రత్యేకదృష్టికి నిదర్శనంగా కళాశాల ప్రతిష్టను జాతీయ స్థాయిల్లో మరింతగా పెంచారన్నారు. అబ్దుల్ సమ్మద్, సుప్పియన్, సుహైల్, పటాన్ ముక్రం ఖాన్ విద్యార్థులు జాతీయ హ్యాకథాన్‌లో ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను అభినందించిన కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కుమారస్వామి గుప్తా